సాక్షి
మంచిర్యాల
శనివారం । 19 । జూలై । 2025



బాసరలో మాస్టర్ ప్లాన్ అమలు

అనేక ఏళ్లుగా బాసర ఆలయ మాస్టర్ ప్లాన్ పెండింగ్‌లో ఉందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. త్వరలో అమలు చేసి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. 8లో▸



'సీతాకోక'ల గుర్తింపుపై అవగాహన

చెన్నూర్ అటవీ డివిజన్ పరిధిలోని కిష్టంపేట సమీపంలో ఉన్న అంబేడ్కర్ అర్బన్ పార్కులో శుక్రవారం అటవీ అధికారులు సీతాకోక చిలుకల గుర్తింపుపై అవగాహన కల్పించారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /26.0

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగి ఉక్కపోతగా ఉంటుంది. గాలులు బలంగా వీస్తాయి.

లంచమిస్తేనే పని!

ఇటీవల ఓ వ్యక్తి తన తండ్రి చనిపోతే పట్టా మార్పిడి విరాసత్ కోసం రూ.10వేలు రెవెన్యూ అధికారులకు సమర్పించుకున్నాడు. కార్యాలయంలోనే నేరుగా నగదు ఇవ్వబోతే..'భలే ఉన్నారు మీరు.. ఆఫీసులో సీసీ కెమెరా ఉంది. ఇదంతా బయటనే..' అంటూ డివిజన్ కార్యాలయంలో పని చేస్తున్న ఓ అధికారిణి నవ్వుతూ లంచం తీసుకుంటానని చెప్పి పని చేశాక రెండ్రోజులకు డబ్బు తీసుకుంది. ఆ ఆఫీసులో ఇలాంటి వసూళ్లు సాధారణం.

- ఎవరి స్థాయిలో వారు వసూళ్ల పర్వం
- అవినీతికి మరిగిన కొందరు అధికారులు
- విధుల నిర్వహణకూ డబ్బులివ్వాల్సిందేనా..?
- ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్న అవినీతిపరులు



ఏసీబీకి పట్టుబడిన లేబర్ ఆఫీసర్ కాటం రామ్మోహన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో కొందరు అధికారుల తీరు డబ్బులిస్తేనే పని చేస్తామన్నట్లుగా మారింది. మరికొందరు నిజాయతీగా విధులు నిర్వర్తిస్తున్నారు. చాలామంది ప్రభుత్వ అధికారులు సర్కారు జీతంతోపాటు అవినీతికి మరిగి జేబులు నింపుకుంటున్నారు. ఇటీవల జిల్లాలో పోలీసు శాఖలో ఓ ఎస్సై, రెవెన్యూ మండల సర్వేయర్ పట్టుబడగా.. తాజాగా శుక్రవారం ఒక్కరోజే ఇద్దరు లేబర్ ఆఫీసర్లు రూ.లక్షలు లంచం డిమాండ్ చేసి చివరకు రూ.వేలల్లో బేరం కుదుర్చుకుని ఏసీబీ అధికారులకు చిక్కారు. ప్రజలతో నేరుగా సంబంధాలు ఉన్న ఆయా శాఖల్లో ఈ తంతు అధికంగా ఉంటోంది. వసతిగృహాల్లో విద్యార్థులకు అందే భోజనం నుంచి రూ.కోట్ల అభివృద్ధి పనులు వరకూ లంచాల పర్వం సాగుతోంది. విద్యుత్ శాఖలోనూ పనుల కోసం వసూళ్లు జరుగుతున్నాయి. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌తో సహా పట్టణాల్లో భవన నిర్మాణ అనుమతుల కోసం ముడుపులు ఇచ్చుకోవాల్సి వస్తోంది.

నేరుగా 'సాక్షి' కెమెరాకు చిక్కి..

గత నెలలో సాక్షాత్తు జిల్లా కలెక్టరేట్‌లోనే ఉన్న కార్మిక శాఖ కార్యాలయ సిబ్బంది ఒకరు డబ్బులు వసూలు చేస్తూ 'సాక్షి' కెమెరాకు చిక్కారు. కార్యాలయం పక్కనే ఉన్న బాత్రూంలో కార్మిక కుటుంబానికి చెందిన ఓ యువకుడి నుంచి నగదు తీసుకుంటూ కనిపించారు. ఫొటోలు తీస్తుండగానే తాము డబ్బులు తీసుకోలేదని తాజాగా పట్టుబడిన అధికారే బుకాయించారు. నిరుపేద కార్మికుల కుటుంబాల నుంచీ డబ్బులకు తెగబడ్డారంటే ఆ శాఖలో కక్కుర్తి అర్థమవుతోంది.


కాసుల శాఖ !


కార్మిక శాఖలో కక్కుర్తి!

సాక్షిలో ప్రచురితమైన కథనాలు

- అప్పట్లో ఓ ఉన్నతాధికారి నేరుగా తన చాంబర్‌లో టేబుల్ డ్రా ఓపెన్ చేసి పెట్టేవారు. ఆ డ్రాలో రూ.వేల కొద్దీ డబ్బులు వేసి వచ్చేవాళ్లు. ఆయన చాంబర్‌లో సీసీ కెమెరా లేకపోవడం ఆయన అదృష్టం. ప్రస్తుతం జిల్లాలో ఆ అధికారి లేరు.
- పౌరసరఫరాల శాఖలో కొంతమంది అధికారులకు బియ్యం వ్యాపారుల నుంచి నెల నెలా మామూళ్లు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. రేషన్ డీలర్లపై 6ఏ కేసు నమోదైతే విచారణ నుంచి మొదలు కేసు పూర్తయ్యే దాకా ఆ రేషన్ డీలరుకు పైసా ఖర్చు కావాల్సిందే. దొడ్డు బియ్యం సమయంలో ఈ దందా అధికంగా ఉండేది. రైస్‌మిల్లు తనిఖీలు, సీఎంఆర్ అనుమతి, రికవరీ తదితర వాటిల్లోనూ వసూళ్ల జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- రవాణా శాఖలో లైసెన్స్ నుంచి రిజిస్ట్రేషన్, పర్మిట్లు, ఇతర ఏ సేవకైనా మధ్యవర్తులతో వెళ్తేనే పని అవుతోంది. నేరుగా వెళ్తే అధికారులు, సిబ్బంది అర్జీదారుడిపై చిరాకు పడుతూ పని చేసేందుకు అస్సలు ఇష్టపడడం లేదు. దీంతో మధ్యవర్తులతో వాస్తవ ఫీజుల కంటే అధికంగా ఇస్తే సులువుగా పనవుతుందనే భావన ఉంది.
- జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులున్న మంచిర్యాల, లక్సెట్టిపేటలో దళారులు, మధ్యవర్తుల హవానే నడుస్తోంది. ఇటీవల ఒకరు తమ భూమి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేయడం లేదంటూ ఏసీబీని ఆశ్రయించారంటే ఇక్కడ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అధికారులు ఆ రోజు ఉదయమంతా అప్రమత్తంగా ఉన్నారు.
- తహసీల్దార్ ఆఫీసుల్లోనూ అక్రమాలు ఆగడం లేదు. నెన్నెలలో ఓ తహసీల్దార్ పైసల ఆశకు బతికున్నా చనిపోయినట్లు సృష్టించి పట్టా మార్పిడి చేసి సస్పెండైన విషయం తెలిసిందే. ఇక గుంటల చొప్పున ఓపెన్ ప్లాట్లు వ్యవసాయ రిజిస్ట్రేషన్లు చేయొద్దని చెబుతున్నా ఓ మండలంలో తహసీల్దార్ ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రేట్ ఫిక్స్ చేసుకున్నారు. నేరుగా తనే రూ.వేలల్లో వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అన్ని మండలాల నుంచి ఒకటో రెండో జరుగుతున్నా ఆ మండలం నుంచి మాత్రం పెద్ద మొత్తంలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా పట్టించుకునే పై అధికారే లేరంటే ఆశ్చర్యం కలగమానదు.
- అభివృద్ధి, సంక్షేమ పనులు చేస్తున్న చాలామంది కాంట్రాక్టర్ల బిల్లుల్లో పర్సంటేజీ ఇవ్వకపోతే అధికారులు మంజూరులో ముప్పు తిప్పలు పెడుతున్నారు. ఎక్కడ అందాల్సినవి ఆ స్థాయిలో ఇస్తేనే పనులు జరుగుతున్నాయి. ఇంజనీరింగ్ విభాగాలతోపాటు బిల్లులు చెల్లించే ట్రెజరీలోనూ ఈ తంతు నడుస్తోంది.

వసూళ్లకు ప్రత్యేక సిబ్బంది!

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసిస్టెంట్ లేబర్ అధికారి(ఏఎల్ఓ) కార్యాలయం అవినీతిమయంగా మారింది. ఏ చిన్న పని జరగాలన్నా లంచం ముట్టజెప్పాల్సి వస్తోంది. ఏకంగా ఇక్కడ వసూళ్లకు ప్రత్యేక సిబ్బందిని నియమించుకోవడం గమనార్హం. శుక్రవారం ఏసీబీకి చిక్కిన బెల్లంపల్లి అసిస్టెంట్ లేబర్ అధికారి పాక సుకన్య డబ్బుల వసూలుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకుంది. ప్రభుత్వ నిబంధనలు పక్కనబెట్టి మోకెనపల్లి రాజేశ్వరి అనే మహిళను అసిస్టెంట్‌గా నియమించుకుంది. ఆమెతోపాటు మరో ఇద్దరు ముగ్గురు అనధికారికంగా అసిస్టెంట్లుగా పని చేస్తున్నట్లు తెలుస్తోంది. వారి ద్వారా లంచాలు తీసుకుంటున్నట్లు ప్రచారంలో ఉంది. అడిగినంత డబ్బు ముట్టనిదే ఏ పనీ చేయరనే ఆరోపణలున్నాయి.



ఏసీబీకి పట్టుబడిన రాజేశ్వరి, సుకన్య

లేబర్‌కార్డు రెన్యూవల్ కావాలన్నా..

అసంఘటిత రంగ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు, సౌకర్యాలు కల్పిస్తోంది. ఇందుకు కార్మికులు కార్మిక శాఖ నుంచి లేబర్‌కార్డు పొందాల్సి ఉంటుంది. ఆ కార్డు ప్రాతిపదికనే లబ్ధి చేకూరుతుంది. ఈ కార్డు రెన్యూవల్ చేసుకోవాలన్నా ముడుపులు ముట్టజెప్పాల్సిందేననే ఆరోపణలున్నాయి. కార్మికుల కూతురు పెళ్లి, ప్రసవానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుంది. ఇందులోనూ వాటా వసూలు చేస్తారని తెలుస్తోంది. ప్రమాదవశాత్తు, సహజ మరణాలకు అందే పరిహారంలోనూ లంచం ఇవ్వాల్సిందేనే చర్చ జరుగుతోంది. తాజాగా సరాల శంకర్ అనే కార్మికుడు చనిపోతే పరిహారం మంజూరు చేసే ఫైల్ అప్రూవల్‌కు రూ.40వేలు డిమాండ్ చేసి తన అసిస్టెంట్ ద్వారా రూ.30వేలు తీసుకుని సుకన్య ఏసీబీ అధికారులకు చిక్కారు.

నేరుగా ఫిర్యాదు చేయండి

ఉమ్మడి జిల్లా ఏసీబీ కార్యాలయం నస్పూర్‌లోనే ఏర్పాటు కావడంతో ఎవరైనా అధికారి లంచం అడిగితే నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది లంచావతారులు జైలు పాలయ్యారు. జిల్లాలో అవినీతికి పాల్పడే అధికారుల ఆట కట్టించాలంటే ఏసీబీ అధికారుల వాట్సాప్ నంబరు 9440446106, టోల్‌ఫ్రీ 1064కు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

న్యూస్‌రీల్

జిల్లాలో 45.4మిల్లీమీటర్ల వర్షపాతం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గురువారం నుంచి శుక్రవారం వరకు 45.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. బెల్లంపల్లి మండలంలో 76.2 మిల్లీమీటర్లు, హాజీపూర్‌లో 39.5, భీమినిలో 28.9, కాసిపేటలో 26.7, తాండూర్‌లో 17.2, మంచిర్యాలలో 21.8, నస్పూర్‌లో 15.3, జైపూర్‌లో 13.2, కన్నెపల్లిలో 7, లక్సెట్టిపేటలో 4.4, చెన్నూర్‌లో 3.1, నెన్నెలలో 2.5, వేమనపల్లిలో 1.7, జన్నారంలో 1.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇప్పటివరకు జిల్లా సాధారణ వర్షపాతం 336.6 మిల్లీమీటర్లు కురువాల్సి ఉండగా 179.7 మిల్లీమీటర్లు కురిసింది. జిల్లా సగటున 47శాతం లోటు నెలకొంది. ఒక భీమిని మండలంలో సాధారణ వర్షపాతం నమోదు కాగా చెన్నూర్, భీమారం, నస్పూర్ మండలాలు 60శాతం పైబడి అత్యధిక లోటుగా, 14 మండలాల్లో 20 నుంచి 57శాతం లోటు వర్షపాతం నెలకొంది.

రైళ్ల రాకపోకలకు అంతరాయం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బెల్లంపల్లి నుంచి రేచినిరోడ్డు రైల్వేస్టేషన్ల మధ్య దిగువ మార్గంలో ఓవర్‌హెడ్ సాంకేతికలోపం కారణంగా శుక్రవారం రాత్రి రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రేచినిరోడ్ రైల్వేస్టేషన్‌లో 22684 లక్నో యశ్వంత్‌పూర్ వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రెండు గంటలపాటు, ఆసిఫాబాద్ రోడ్డు రైల్వేస్టేషన్‌లో 22673 జోధ్‌పూర్ హమ్సాఫర్ గుడి వీక్లీ గంటన్నరపాటు, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో సుమారుగా 50నిమిషాలు 12296 దానాపూర్ నుంచి ఎస్.ఎం.వీ.టీ బెంగళూరు సంఘమిత్ర సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయాయి. ఆ తర్వాత రైళ్ల రాకపోకలు పునరుద్ధరించారు.

ఓసీసీ 'గుర్తింపు' ఎన్నికలపై నిరాశ

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంటు కంపెనీ(ఓసీసీ) గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలపై కార్మికులు, కార్మిక సంఘాల నాయకులకు నిరాశే ఎదురైంది. కార్మిక శాఖ అధికారులు ఎన్నికల నిర్వహణలో నాలుగేళ్లుగా జాప్యం చేస్తున్నారు. చివరికి కోర్టు ఆదేశాలతో ఎన్నికలకు ముందుకొచ్చినా కొందరి ఒత్తిడితో పథకం ప్రకారం జాప్యం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియ ప్రారంభించినట్లు హైకోర్టుకు సమర్పించేందుకు పది రోజుల క్రితం గుర్తులు కేటాయించగా.. తిరిగి 18న శుక్రవారం షెడ్యూల్, ఎన్నికల తేదీ ప్రకటిస్తామని పేర్కొన్నారు. తీరా అధికారులు స్పందించకపోవడంపై కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏదో ఒక విధంగా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు సాగదీస్తూ 'స్థానిక' ఎన్నికలు ఉన్నందున తర్వాత నిర్వహిస్తామని అధికారులు తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ నెల 22న కోర్టుకు ఎన్నికల షెడ్యూల్ సమర్పించాల్సి ఉన్నందున అధికారులు ఏం నిర్ణయం తీసుకుంటారా అని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఎదురుచూస్తున్నారు.

జాతర ఏర్పాట్లు పరిశీలించిన డీసీపీ

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారి మైసమ్మ ఆలయం వద్ద ఆదివారం నిర్వహించనున్న ఆషాఢ మాసం బోనాల జాతర ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ భాస్కర్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో జాతీయ రహదారి పక్కనే మైసమ్మ ఆలయం ఉండడం, భక్తుల తాకిడి కూడా ఎక్కువ ఉండే అవకాశం ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని డీసీపీ తెలిపారు. భక్తులు పోలీసుల సూచనలను పాటించాలని కోరారు.

మళ్లీ రోడ్డెక్కిన విద్యార్థినులు

కోటపల్లి: కోటపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన అశోక్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు శుక్రవారం మళ్లీ రోడ్డెక్కారు. పాఠశాల ఎదుట రోడ్డుపై బైఠాయించారు. ఎస్సై రాజేందర్ అక్కడికి చేరుకుని విద్యార్థినులతో మాట్లాడారు. హెచ్‌ఎం అశోక్ విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించారని ఆందోళన చేపట్టగా అధికారులు తప్పుడు నివేదిక ఇచ్చిన బదిలీ చేసి చేతులు దులిపేసుకున్నారని, ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఏటీడీవో పురుషోత్తంకు విన్నవించారు. మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేసిన ఆయనపై చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. చర్యలకు విచారణ కమిటీ వేసినా రోజుకో విధంగా ఆయన మద్దతుదారులు పాఠశాల ఎదుట తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ఇళ్లకు వెళ్లిపోతామని స్పష్టం చేశారు. విచారణ కమిటీ నివేదికను అనుసరించి చర్యలు ఉంటాయని ఎస్సై రాజేందర్, ఏటీడీవో పురుషోత్తం నచ్చజెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



బెల్లంపల్లిలో పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

తాండూర్/బెల్లంపల్లిరూరల్: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శుక్రవారం తాండూర్ మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, బెల్లంపల్లి మండలంలోని కేజీబీవీ, తెలంగాణ ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలు, తరగతి గదులు, మూత్రశాలలు, వంటగదులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, మంచినీరుతోపాటు ఏవైనా సమస్యలు ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, ఉత్తమ ఫలితాలు సాధించేలా మెరుగైన విద్యాబోధన చేయాలని తెలిపారు. పారిశుద్ధ్యం లోపించకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తాండూర్‌లో ఇంటర్మీడియట్ కళాశాల భవనంపై అదనపు గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ మల్లేశం, కేజీబీవీ ప్రత్యేక అధికారి కవిత, బెల్లంపల్లి ఎంపీడీవో మహేందర్, ఎంఈవో జాడి పోచయ్య, గురుకుల పాఠశాల, కేజీబీవీ ప్రధానోపాధ్యాయులు సత్తయ్య, రజిత, ఏఈఈ వినయ్ పాల్గొన్నారు.

వెంకట్రావుపేటలో బర్డ్‌వాక్

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట అటవీ రేంజ్ వెంకట్రావుపేట చెరువు వద్ద శుక్రవారం అటవీ అధికారులు బర్డ్‌వాక్ చేశారు. మహారాష్ట్రలోని యావత్మాల్ వైల్డ్ లైఫ్ వార్డెన్ రంజాన్ ఇరాని పాల్గొన్నారు. ఇండియన్ స్పాట్ బిల్డ్ డక్, ఎరోసియన్ కూట్, విజిటింగ్ డక్స్‌లు కనిపించినట్లు రేంజ్ అధికారి అత్రె సుభాష్ తెలిపారు. పక్షులను పర్యవేక్షించి వాటి వివరాలు సేకరిస్తే అవగాహన పెరుగుతుందని వైల్డ్ లైఫ్ వార్డెన్ సిబ్బందికి సూచించారు. ఈ ప్రాంతంలో అనేక రకాల పక్షులున్నాయని, వాటిని గుర్తించి సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సెక్షన్ అధికారు అల్తాఫ్ హుస్సేన్, బీట్ అధికారులు చంద్రశేఖర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వసతిగృహాల్లో ప్రవేశాలకు ఆటంకాలు

- ఆధార్‌లో చిన్న తప్పిదమైనా నమోదుకు బ్రేక్
- ఎస్సెస్సీ ధ్రువపత్రంతోనే సవరణ
- సర్టిఫికెట్ల మంజూరులో జాప్యం
- ఆందోళనలో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: ఆర్థిక ఇబ్బందులతో విద్యార్థులు కళాశాల విద్యకు దూరం కావొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాలు నిర్వహిస్తోంది. 2025–26 విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో వసతిగృహాల్లో ఇంటర్ విద్యార్థుల ప్రవేశం ప్రారంభమైంది. అడ్మిషన్ల కోసం వసతిగృహాలకు వెళ్తే పదో తరగతి మెమో వివరాలు ఆధార్‌కార్డులో పోలి లేకపోవడం, ఏ చిన్న తప్పిదం ఉన్నా నమోదు కాకపోవడంతో తిప్పలు తప్పడం లేదు. ఆధార్ కార్డు సవరణ కోసం మీ సేవకు వెళ్తే ఒరిజినల్ సర్టిఫికెట్లు తప్పనిసరని చెబుతుండడంతో వెనుదిరుగుతున్నారు. ఇంటర్, వృత్తివిద్య కోర్సులు చదివేందుకు ఆసక్తి ఉన్నా గ్రామీణ ప్రాంత ఎస్సీ విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోంది.

అడ్మిషన్లు ఇలా..

జిల్లాలోని మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి, లక్సెట్టిపేటలో రెండేసి వసతిగృహాలు.. మొత్తంగా ఎనిమిది ఉన్నాయి. ఒక్కో హాస్టల్‌లో 100మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది. జిల్లా అధికారి అనుమతితో ఒక్కో వసతిగృహంలో 150 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తున్నారు. ఈ హాస్టళ్లలో ప్రవేశాలు పొందాలంటే స్కాలర్‌షిప్ కోసం ముందుగా తెలంగాణ ఈ–పాస్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. పదో తరగతి మెమో, ఆధార్‌కార్డులో ఇంటిపేరు, పుట్టినతేదీ, విద్యార్థి పేరు ఒకేలా ఉండాలి. ఏమాత్రం తేడా ఉన్నా పదో తరగతి మెమోలో పేరుకు ముందు ఉండాల్సిన ఇంటిపేరు చివరన ఉన్నా.. ఐకు బదులు వై అని వ్యత్యాసం ఉన్నా ప్రవేశాలు పొందలేకపోతున్నారు. వెబ్‌సైట్‌లో విద్యార్థి వివరాలు నమోదు చేయగానే మిస్‌మ్యాచ్ అని రావడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు రెన్యూవల్ చేసుకుంటుండగా ప్రథమ సంవత్సర విద్యార్థుల ప్రవేశాలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

పదో తరగతి సర్టిఫికెట్లతోనే..

ఆధార్ కార్డు నవీకరణకు దరఖాస్తు చేసుకున్నా అంత త్వరగా రావడం లేదని తెలుస్తోంది. సవరణకు పదో తరగతి ఒరిజినల్ మెమో కావాలంటూ మీ సేవా కేంద్రాల నిర్వాహకులు తేల్చి చెబుతున్నారు. పదో తరగతి సర్టిఫికెట్లు మంజూరు కావాలంటే ఆగస్టు, సెప్టెంబర్ దాటే పరిస్థితి నెలకొంది. దీంతో సగం సిలబస్ అయిపోతుందనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరు నమోదు కాకుంటే వసతిగృహాల్లో అడ్మిషన్లు కల్పించక ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలోని ఓ వసతిగృహంలో 50 మంది విద్యార్థులు అడ్మిషన్లకు వస్తే 40 మంది వరకు ఆధార్‌లో తప్పులతో మిస్‌మ్యాచ్ అని వచ్చిందంటే పరిస్థితి ఏ విధంగా అర్థం చేసుకోవచ్చు. డౌన్‌లోడ్ చేసుకున్న ఎస్సెస్సీ మెమోపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అటెస్టెడ్ చేసిన వాటికి అనుమతి ఇస్తే కొంత మేర సమస్య పరిష్కారమయ్యే వీలుంది. ఎస్సీ డీడీ దుర్గాప్రసాద్‌ను సంప్రదించగా.. తమ దృష్టికి రాలేదని, విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడుతామన్నారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక పర్యటన


మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.చంద్రయ్య శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. హాజీపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించగా.. తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, సిబ్బంది స్వాగతం పలికారు. రెవెన్యూ సదస్సుల ద్వారా భూభారతిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆమోదానికి సూచనలు అందించారు. వీలైనంత త్వరగా పరిశీలించి పై అధికారులకు నివేదించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన రైతులతో మాట్లాడారు. గుడిపేట శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ అండర్ టన్నెల్‌లోకి వెళ్లి పనితీరును పరిశీలించారు. నాయబ్ తహసీల్దార్ అతీక్, సీనియర్ అసిస్టెంట్ రంజిత్, గిర్దావర్లు ప్రభు, మంగ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న చంద్రయ్య

ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఏసీపీ తండ్రి మృతి

- ప్రమాద స్థలాన్ని సందర్శించి కంటతడి
- అతివేగం, అజాగ్రత్తతో గతంలోనూ ఘటనలు



ఐలయ్య (ఫైల్)

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల వద్ద రహదారిపై శుక్రవారం ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయనను పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తండ్రి గజ్జి ఐలయ్య(64)గా గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. జైపూర్ మండలం రసూల్‌పల్లి గ్రామంలో సింగరేణి రిటైర్డు ఉద్యోగి గజ్జి ఐలయ్య నివాసం ఉంటున్నాడు. ఈయన కుమారుడు గజ్జి కృష్ణ పెద్దపల్లి ఏసీపీగా పని చేస్తున్నారు. ఐలయ్య శుక్రవారం ఉదయం వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనం మీద హాజీపూర్ వెళ్లి తిరిగి మంచిర్యాలకు వస్తున్నాడు. పాతమంచిర్యాల వద్దకు రాగానే వెనుకాల నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్ అతివేగంగా ఐలయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో కిందపడిన ఐలయ్య తలపై నుంచి ట్రాక్టర్ టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగం, అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. సంఘటన స్థలాన్ని ఏసీపీ కృష్ణ, స్థానిక డీసీపీ ఎగ్గడి భాస్కర్, ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోదర్‌రావు పరిశీలించారు. తండ్రి మృతదేహాన్ని చూసి కృష్ణ బోరున విలపించారు. ఐలయ్యకు భార్య కొమురవ్వ, కూతురు సమ్మక్క, కుమారుడు కృష్ణ ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. కాగా, జిల్లా కేంద్రంలో రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు మద్యంమత్తులో నడుపుతున్నారని, కొందరికి డ్రైవింగ్ లైసెన్స్‌లు కూడా లేవని పలువురు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. మే 15న హాజీపూర్ మండలం ముల్కల్ల వద్ద గుడిపేటకు చెందిన పాల వ్యాపారి బయ్య మధూకర్(31) ట్రాక్టర్ ఢీకొని అక్కడికక్కడే చనిపోయాడని తెలిపారు.



రోదిస్తున్న పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, పక్కన డీసీపీ

ఎన్నికల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

పాతమంచిర్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు రూ.6వేలు, ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులకు రూ.4వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. హామీలు అమలుపర్చకుంటే ఆగస్టు 13న పింఛన్‌దారులతో చలో హైదరాబాద్ మహాగర్జన చేపడుతామని అన్నారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్, జిల్లా ఇంచార్జి పెద్దపల్లి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు అప్పారావు, మందమర్రి, లక్సెట్టిపేట మండలా అధ్యక్షులు రమేష్, దేవి ప్రకాష్ పాల్గొన్నారు.

మహారాష్ట్ర బ్యాడ్మింటన్ చాంపియన్‌గా అర్జున్‌రెడ్డి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీకి చెందిన అలుగువెల్లి తిరుపతిరెడ్డి, ప్రేమలత దంపతుల మనవడు అర్జున్‌రెడ్డి మహారాష్ట్ర బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను సాధించాడు. వీరు నాందేడ్‌లో స్థిరపడగా, బ్యాడ్మింటన్‌లో రాణిస్తూ ఇప్పటికే పలు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయిలో చాంపియన్‌గా నిలవడంపై జిల్లా ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. అండర్–19 విభాగంలో అర్జున్‌రెడ్డి (16) వచ్చే సెప్టెంబర్‌లో జరిగే జోనల్స్‌లో పాల్గొంటారని కోచ్ భాస్కర్‌బాబు తెలిపారు.

బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగకుండా చర్యలు

మందమర్రిరూరల్: వర్షాకాలంలో ఏరియాలోని కేకే–ఓసీలో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఏరియాలోని కేకే–ఓసీని ఏరియా జీఎం దేవేందర్‌తో కలిసి సందర్శించారు. పవర్‌పాయింట్ నుంచి పని ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలుగుతుందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనంతరం కేకే–1 రైల్వే సైడింగ్, ఓసీ ఆర్‌అండ్‌ఆర్ ప్రాజెక్ట్‌ను సందర్శిచారు. ఎస్వో టు జీఎం విజయ్‌ప్రసాద్, కేకే–ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, మేనేజర్ రామరాజు, ఇంజనీర్ బాలాజీ భగవతి ఝా, ఎస్ఈ రాము పాల్గొన్నారు.



కేకే–ఓసీని పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి

క్షయ వ్యాధిపై అపోహలు వద్దు

తాండూర్: క్షయ వ్యాధిపై ప్రజలు అపోహలు వీడాలని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ అన్నారు. శుక్రవారం తాండూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు, వైద్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సత్వర వ్యాధి నిర్ధారణ క్షయ వ్యాధి నివారణకు మార్గమన్నారు. రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించి ఆరోగ్య కేంద్రంలో తెమడ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, హెచ్ఐవీ, హైపటైటిస్, బీ, సీ క్షయ పరీక్షలు నిర్వహించారు. వైద్యులు ఝాన్సీరాణి, లక్ష్మీప్రసన్న, ఎంపీడీఓ శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జిలు మధుబాబు, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రపంచ మహాసభల్లో జన్నారం మండలవాసి



మహాసభలో పాల్గొన్న శ్రీకాంత్‌రెడ్డి

జన్నారం: అమెరికాలోని ఫ్లోరిడా అరెంజ్ కౌంటి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రపంచ లయన్స్‌క్లబ్ మహాసభల్లో మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన లయన్స్ జెడీసీ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రపంచ స్థాయిలో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ 107వ వార్షికోత్సవం సందర్భంగా అమెరికాలోని ఫ్లోరిడాలో నిర్వహించిన మహాసభలకు ప్రపంచ నలుమూలల నుంచి 20 వేల మంది హాజరైనట్లు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఇందులో తెలంగాణ రాష్ట్రం నుంచి తనకు అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. తనకు అందులో ప్రసంగించే అవకాశం రావడం ఆనందంగా ఉందని తెలిపారు.

రెచ్చగొట్టేలా పోస్టు పెట్టిన ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన ఆదిలాబాద్ పట్టణానికి చెందిన పద్మవార్ రాకేశ్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ప్రజాశాంతికి భంగం కలిగించేలా, వివాదాలు సృష్టించేలా సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన రాకేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అతడి నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రూపులు, మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టేవారిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే అడ్మిన్‌తోపాటు పోస్టు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఐదుగురి బైండోవర్

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ బీట్‌లో అటవీ భూముల్లో చెట్ల పొదలు తొలగించి, కేసులు నమోదైన ఐదుగురు గిరిజన మహిళలను అటవీశాఖ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారిని తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే ఎదుట బైండోవర్ చేశారు.

బైక్ చోరీ నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ద్విచక్ర వాహనం చోరీకి పాల్పడిన తంతోలి గ్రామానికి చెందిన పురాణం పోశెట్టిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. గత నెల 20న మహారాష్ట్రకు చెందిన ఆదిల్‌రాజ తన అత్తగారి ఊరైన ఆదిలాబాద్‌కు వచ్చాడు. ఆయన భార్య ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఈనెల 7న ద్విచక్ర వాహనాన్ని రాణిసతీజీ సమీపంలోని షాప్ ముందు పార్కింగ్ చేసి నాగ్‌పూర్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి ద్విచక్రవాహనం కనిపించకపోవడంతో వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం తంతోలి నుంచి ఆదిలాబాద్‌వైపు పోశెట్టి సదరు వాహనంతో వస్తుండగా పట్టుకున్నట్లు వివరించారు.

కోర్టులో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన పాత నేరస్తుడైన టెంపు సురేశ్ పలు కేసుల్లో శుక్రవారం కోర్టుకు హాజరయ్యాడు. ఈ క్రమంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. దీంతో టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు అతనిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి

సారంగపూర్: మండలకేంద్రానికి చెందిన ఉదుత భూమేశ్ (35) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. భూమేశ్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ప్రతీరోజు అతిగా మద్యం సేవించి ఏ పనీ చేయకుండా ఖాళీగా ఉండేవాడు. ఆయన భార్య లత ఈనెల 10న మద్యం సేవించవద్దని అతడిని తీవ్రంగా మందలించింది. ఈక్రమంలో మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే మొదట నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన కోటగిరి శ్రీనివాస్ ఈ నెల 14న అబుదాబి దేశంలో కంపెనీలో విధులు నిర్వహిస్తుండగా గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం స్వగ్రామానికి మృతదేహం చేరుకోగా అంత్యక్రియలు నిర్వహించారు. గల్ఫ్ వర్కర్స్ అవేర్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో మృతదేహాన్ని అబుదాబి నుంచి స్వగ్రామానికి చేరుకునేలా చర్యలు తీసుకున్నారు.

నానోనే నయం

- ద్రవరూప యూరియాతో పైరుకు మేలు
- సాగు ఖర్చు తగ్గి.. పెరగనున్న దిగుబడి
- విరివిగా ప్రచారం చేస్తున్న అధికారులు
- రైతులను ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం





నిర్మల్‌చైన్‌గేట్: ఖరీఫ్ సాగు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. వివిధ పంటల్లో దశలవారీగా ఉపయోగించే యూరియా కొరత రైతులను వేధిస్తోంది. అవసరానికి సరిపడా కోటా రాకపోవడం, వచ్చినా కొన్నిచోట్ల డీలర్లు మాయాజాలం ప్రదర్శిస్తుండడం.. ఇంకొన్ని చోట్ల భవిష్యత్‌లో కొరత వస్తుందని రైతులు ముందుగా కొనుగోలుకు సిద్ధమవుతుండడంతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు గుళికల యూరియాకు బదులు నానో (ద్రవరూపం) యూరియా వాడాలని చెబుతూనే దీనితో కలిగే ప్రయోజనాలపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఖర్చు తగ్గడమే కాకుండా ఫలితం బాగుంటుందని, రవాణా సులువవుతుందని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ఇప్పుడిప్పుడే రైతులు నానో యూరియా వాడకానికి ముందుకువస్తున్నారు. అయితే, అధికారులు మరింత విస్తృత ప్రచారం చేస్తే అధికసంఖ్యలో రైతులు నానో యూరియా వైపే మొగ్గుచూపే అవకాశముంది.

గుళికల యూరియా కంటే ధర తక్కువే..

నానో యూరియా ఒక్క బాటిల్ (500 మి.లీ).. 45 కేజీల బస్తా గుళికల యూరియాతో సమానమని చెబుతున్నారు. 45కిలోల యూరియా బస్తా ధర రూ.270 కాగా, అర లీటర్ నానో యూరియా రూ.225కే లభిస్తుంది. నత్రజనిని అందించే ఈ ఎరువు ద్వారా మొక్కల్లో పచ్చదనం, చురుకైన పెరుగుదల నమోదవుతుందని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. పంటలకు నత్రజనిని అందించేలా రైతులు గుళికల యూరియాను 2-3 సార్లు పైపాటుగా వేస్తున్నారు. ఇందులో నత్రజనిని 30-50 శాతమే పంట వినియోగించుకుంటోంది. మిగతాదంతా వృథా అవుతోంది. లేదా నేల, గాలి, నీటిని కలుషితం చేస్తోంది. అదే నానో ఎరువు వాడకంతో ఇలాంటివేవీ జరగవు.

బహుళ ప్రయోజనకారిగా..

నానో యూరియా కణాలు చిన్నవిగా ఉండడంతో పంటకు 80 శాతం కన్నా ఎక్కువగా చేరుతుంది. మొక్కలకు నత్రజని అవసరాన్ని సమర్థవంతంగా తీరుస్తూ ఆకుల్లో కిరణజన్య సంయోగక్రియను పెంచుతుంది. వేర్లలో కణజాలం వృద్ధికి ఉపయోగపడుతుంది. సంప్రదాయ యూరియాతో పోలిస్తే 50 శాతం, అంతకంటే తక్కువే అవసరమవుతుండడంతో రైతులకు ఖర్చు తగ్గుతుంది. అంతే కాకుండా గుళికల యూరియా బస్తాల రవాణా భారం తగ్గుతుంది. 500 మి.లీ నానో యూరియా బాటిల్ సులభంగా ఎక్కడికైనా తీసుకెళ్లవచ్చని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఇది లీటర్ నీటికి 2-4 మి.లీ. కలిపి పంట చురుకైన ఎదుగుదల దశలో ఆకులపై పిచికారీ చేయాలి. ఎకరాకు లీటర్ నానో యూరియా సరిపోనుండగా, పంట వేసిన 20-25 రోజుల్లో ఓసారి, 20-25 రోజుల తర్వాత మరోసారి పిచికారీ చేయాల్సి ఉంటుంది. ఈ యూరియా ద్రవరూపంలో ఉండడంతో ఆకులపై పిచికారీ చేసినప్పుడు రంధ్రాల ద్వారా సులభంగా లోనికి వెళ్తూ మొక్క అన్ని భాగాలకు చేరుకుంటుంది. అవసరం మేరకు మొక్కలు పీల్చుకున్నాక మిగతాది మొక్కల ఇతర భాగాల్లో నిల్వ చేయబడి అవసరమైనప్పుడు విడుదలవుతుంది.

అవగాహన కల్పించాలి



ఇన్నాళ్లుగా పంటలకు గుళికల రూపంలో ఉన్న యూరియా వాడుతున్నాం. ఒక్కోసారి యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్నాం. గుళికల యూరియాకు బదులు ద్రవరూపంలో ఉన్న నానో యూరియా వాడాలని అధికారులు చెబుతున్నారు. కానీ.. అది పంటలకు ఎలా ఉపయోగపడుతుందో రైతులకు పంట చేన్ల వద్ద వివరిస్తే అర్థమవుతుంది.

– సాయన్న, పెంచికల్‌పహాడ్, కుంటాల మండలం

దిగుబడి పెరుగుతుంది



గుళికల ఎరువు కంటే నానో ఎరువులు చాలా మేలైనవి. వరి నాటుకు ముందుగా ఒకసారే నానో డీఏపీని పొలంలో పిచికారీ చేయాలి. అలాగే నానో యూరియాను లీటర్ నీటికి 2మి.లీ. లేదా 4మి.లీ. చొప్పున కలిపి మొదట పంట పెరుగుదల దశలో, తర్వాత నెలలోపు పూత దశలో పిచికారీ చేయాలి. దీంతో సుమారు 8శాతం పంట దిగుబడి పెరుగుతుంది.

– నాగరాజు, ఏవో, నిర్మల్

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న నగేశ్, మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రం శివారులోని కొండాపూర్ వద్ద గల నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు వేదికగా నిలిచింది. మంచిర్యాల జిల్లా స్టార్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న ప్రారంభమైన పోటీలు 20వరకు కొనసాగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. అండర్-19 బాలురు, బాలికలకు సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు కొనసాగుతున్నాయి. గురువారం క్వాలిఫై పోటీలు నిర్వహించారు. శుక్రవారం నుంచి ఈనెల 20వరకు మెయిన్ డ్రా పోటీలు కొనసాగనున్నాయి. తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నుంచి 10మంది అంపైర్లు, ఒక రిఫరీ, ఒక మ్యాచ్ కంట్రోలర్ హాజరయ్యారు. జిల్లా క్రీడలశాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ కిశోర్, కో కన్వీనర్ వన్నెల భూమన్న, కోఆర్డినేటర్లు సందీప్, మధుకర్‌గౌడ్, మహేశ్, ప్రణీత్, నందకుమార్ పోటీలను పర్యవేక్షించనున్నారు. కాగా, రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ప్రారంభమైన మెయిన్ డ్రా పోటీలకు ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ గోడం నగేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్‌రాథోడ్, సీనియర్ నాయకులు సత్యనారాయణగౌడ్, రావుల రాంనాథ్, మున్సిపల్ మాజీ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్ హాజరయ్యారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై శంకర్

భైంసారూరల్: జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తూ కష్టపడకుండా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సైలు శంకర్, సుప్రియ వివరాలు వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 15న హజ్గుల్ ఎక్స్ రోడ్డుకు కొద్ది దూరంలో ఇద్దరు వ్యక్తులు కారులో సెల్‌ఫోన్లు చూస్తు కూర్చున్నారు. భైంసాలో నివాసముంటున్న మహారాష్ట్ర వాసి దతురి వినోద్, ఆదిలాబాద్‌కు చెందిన సిందే దినేశ్ వీరి వద్దకు వెళ్లారు. వీరిద్దరు ఎలాంటి సంపాదనలేకుండా జులాయిగా తిరుగుతున్నారు. కారులో ఉన్న ఇద్దరిని చంపేస్తామని భయపెట్టి బీరు బాటిల్‌తో కారు అద్దాలు పగులగొట్టి వారి వద్ద ఉన్న రూ.10వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు ఎత్తుకువెళ్లారు. అక్కడి నుంచి మహారాష్ట్రకు వెళ్లి తక్కువ ధరకు గంజాయి కొని ఇక్కడ గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయిస్తే అధిక డబ్బులు వస్తాయని నిర్ధారించుకున్నారు. మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి గురువారం పార్డి(బి) బైపాస్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయిస్తుండగా పోలీసులు వీరిని పట్టుకున్నారు. వీరి వద్ద 1,070 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్ ఆధ్వర్యంలో నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ నైలు, ఎస్సైలు శంకర్, సుప్రియ, సిబ్బందిని ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు. ఏఎస్సై మారుతి, పోలీసులు ఉన్నారు.

బాసరలో మాస్టర్ ప్లాన్ అమలు

- త్వరలోనే పరిశీలన, ఆలయ అభివృద్ధి
- వైఎస్సార్ హయాంలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- బాసరలో ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి శ్రీధర్‌బాబు

బాసర: అనేక సంవత్సరాలుగా బాసర ఆలయానికి సంబంధించిన మాస్టర్‌ప్లాన్ పెండింగ్‌లో ఉందని, త్వరలోనే పరిశీలిస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దలు, బ్రాహ్మణోత్తముల ద్వారా మాస్టర్‌ప్లాన్ అమలు చేసి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ ఆలయాన్ని శుక్రవారం ఆయన కుటుంబ సమేతంగా సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. మొదటిసారి ఆలయానికి వచ్చిన మంత్రికి ఆలయ వైదిక బృందం సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు ప్రవీణ్‌పాఠక్ అమ్మవారి హారతి, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. మంత్రి శ్రీధర్‌బాబు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తన సోదరి, కుటుంబ సభ్యులతో సరస్వతి అమ్మవారిని దర్శించుకోవడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. గతంలో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బాసరలో చదువుల తల్లి ఉంది కాబట్టే కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ఉందని తెలిపారు. ప్రత్యేకంగా మొన్ననే దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి వివేక్‌ను బాసరకు పంపించిందని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబును కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల, భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్ కలిశారు. ట్రిపుల్ ఐటీ వసతి గృహంలో కలెక్టర్ అభిలాష అభినవ్‌తో జిల్లా అభివృద్ధిపై మంత్రి చర్చించారు. పలు సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. శాంతిభద్రతల గురించి ఎస్పీ షర్మిలను ఆరా తీశారు. వీరి వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు, పార్టీ మండలాధ్యక్షుడు మమ్మాయి రమేశ్ తదితరులున్నారు.

‘సీతాకోక’ల గుర్తింపుపై అవగాహన



సీతాకోకలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



అరుదైన మంకీ ఫజిల్ సీతాకోకచిలుక

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ అటవీ డివిజన్ పరిధిలోని కిష్టంపేట సమీపాన అంబేడ్కర్ అర్బన్ పార్క్‌లో శుక్రవారం జిల్లా అటవీశాఖ అధికారి శివ ఆశీష్‌సింగ్, శాస్త్రవేత్త డాక్టర్ రంజాన్ విరాణి సీతాకోకచిలుకల గుర్తింపుపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పార్క్ ఏరియాలో 81 జాతుల సీతాకోకలను గుర్తించినట్లు తెలిపారు. ఇందులో అరుదైన మంకీ ఫజిల్ అనే సీతాకోక చిలుకను కవ్వాల్ అభయారణ్యం ఏరియాలో మొదటిసారిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. చెన్నూర్ డివిజన్ అధికారి కే సర్వేశ్వర్, చెన్నూర్, కోటపల్లి, నీల్వాయి అటవీరేంజ్ అధికారులు ఎం.సదానందం, హఫీజొద్దీన్, డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్, సెక్షన్ అధికారులు అంజయ్య, సతీశ్, రాజేశ్, జావిద్, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్ట్రైపిడ్ టైగర్



క్రిమ్‌సన్ రోజ్



కమాండర్



కామన్ మార్మన్ మెయిల్



గ్రే పాన్సీ

చాతాలో వృద్ధుడి దారుణ హత్య

- గొంతుకోసి హతమార్చిన దుండగులు
- డాగ్‌స్క్వాడ్‌తో గాలిస్తున్న పోలీసులు



బలరాంగౌడ్ (ఫైల్)

కుభీర్: మండలంలోని చాతా గ్రామంలో గురువారం రాత్రి తాళ్లపల్లి బలరాంగౌడ్ (70)ను గుర్తు తెలియని వ్యక్తులు గొంతుకోసి హత్యచేశారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. బలరాంగౌడ్ కొడుకు, కోడలు గురువారం మధ్యాహ్నం తన చిన్నకూతురు ఇంటికి వేములవాడకు వెళ్లారు. బలరాంగౌడ్ దినమంతా తెల్లకల్లు దుకాణం నడిపాడు. రాత్రి 10వరకు గురుబోధ భజన పాటలు పాడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆ తర్వాత గ్రామ చివరలోని తనింట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి హత్యచేసి వెళ్లారు. ఉదయం కొందరు తెల్లకల్లు కోసం బలరాంగౌడ్ ఇంటికి చేరుకున్నారు. అతడిని పిలువగా బయటికి రాకపోవడంతో తలుపు తీసి లోనికి వెళ్లి చూడగా రక్తం మడుగులో అతడి మృతదేహం కనిపించింది. వారు వెంటనే మృతుడి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఏఎస్పీ అవినాష్, సీఐ నైలు, ఎస్సై కృష్ణారెడ్డి చేరుకుని ఘటనాస్థలిని పరిశీలించారు. ఫింగర్ ప్రింట్, క్లూస్ టీం సిబ్బంది ఆధారాలు సేకరించారు. భక్తిభావం కలిగి అందరితో కలివిడిగా ఉండే గంగారాంగౌడ్ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లున్నారు. మృతుడి కొడుకు రమేశ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాసర గోదావరి వద్ద ఇద్దరి ఆత్మహత్యాయత్నం

బాసర: బాసర గోదావరి నది మొదటి ఘాట్ వద్ద ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని స్థానిక పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా పులాంగ్ పట్టి గల్లీ ప్రాంతానికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి మామిడాల సాయిబాబా శుక్రవారం గోదావరి నది వద్ద ఆత్మహత్యాయత్నానికి యత్నించగా కానిస్టేబుల్ మోహన్‌సింగ్, హోంగార్డు గణేశ్ అడ్డుకున్నారు. అతడిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు. కాగా, అంతకుముందే ఓ వృద్ధుడు గోదావరిలో దూకగా గంగపుత్ర సంఘం మహిళలు కాపాడారు. ఇద్దరిని కాపాడిన గంగపుత్ర మహిళలు, కానిస్టేబుల్ మోహన్‌సింగ్, హోంగార్డ్ గణేశ్‌ను పలువురు అభినందించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

జన్నారం: జన్నారానికి చెందిన ఎండీ సీమా ఇండికా ఈజీ కలర్ షాంపు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. జన్నారంలోని పొలం గట్టుపై కూర్చుని ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ‘డయల్ 100’కు ఫోన్ చేయగా ఎస్సై అనూష వెంటనే సిబ్బందిని అక్కడికి పంపారు. గ్రామస్తులు అప్పటికే 108కు సమాచారం ఇచ్చారు. పోలీసుల సహాయంతో 108 అంబులెన్స్ ద్వారా జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం లక్సెట్టిపేటకు తీసుకెళ్లారు. తాను వేసుకున్న నారు మడిలో తన బావ ముజీబొద్దీన్ గడ్డి మందు చల్లడంతోనే నారు ఎండిపోయిందని, భూమి విషయంలో కొన్ని రోజులుగా ఇబ్బంది పెడుతున్నట్లు ఆమె ఆరోపించింది. అందుకే మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సీమ పేర్కొంది. ఈ విషయంపై ముజీబొద్దీన్‌ను సంప్రదించగా భూమి విషయంలో కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందని, కావాలనే తనను బద్నాం చేస్తుందని తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్నందున పొలం వద్దకు వెళ్లడం లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్సై అనూషను సంప్రదించగా ‘డయల్ 100’కు ఫోన్ వచ్చినట్లు సమాచారం రాగా వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి అక్కడికి పంపించినట్లు తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

కడెం ప్రాజెక్ట్‌లో దూకి యువకుడి ఆత్మహత్య

కడెం: కడెం ప్రాజెక్ట్‌లో దూకి మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబారిపేట్ గ్రామానికి చెందిన పుట్టపాక రాజు హైదరాబాద్‌లో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఇంటికి వచ్చిన రాజు ఈనెల 17న అర్ధరాత్రి తాను కడెం ప్రాజెక్ట్‌లో దూకి చనిపోతున్న అని తన మేనల్లుడు రంజిత్‌కు మేసేజ్ చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టగా ఆచూకీ లభించలేదు. శుక్రవారం సాయంత్రం ప్రాజెక్ట్‌లో మృతదేహం లభ్యమైంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కేకే-ఓసీలో విలువైన కేబుల్ చోరీ



దొంగలు తొలిచి పారేసిన కేబుల్ కవర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే-ఓసీలో సుమారు రూ.60వేల విలువైన 80 నుంచి 90 మీటర్ల ఫ్లెక్సెబుల్ వైర్ దొంగలు ఎత్తుకెళ్లారు. ఓసీలో పంపు వద్ద వినియోగించడానికి సిద్ధంగా ఉంచిన కేబుల్‌ను కట్ చేసి అక్కడే పైకవర్ తొలిచి తీసుకెళ్లారు. విధి నిర్వహణలో ఉన్న సెక్యూరిటీ నిర్లక్ష్యంతోనే చోరీ జరినట్లు తెలుస్తోంది. దొంగలు కేబుల్‌ను తొలిచి ఎత్తుకెళ్లే వరకూ సెక్యూరిటీకి కనిపించకపోవడం విడ్డూరం. ఈ విషయమై ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ నగునూరి రవిని సంప్రదించగా, కేబుల్ చోరీకి గురైంది నిజమేనని తెలిపారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

మందమర్రిలో భారీ చోరీ



బీరువాను పరిశీలిస్తున్న క్లూస్ టీం సభ్యులు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధి బురుదగూడెంలోని సింగరేణి ఉద్యోగి దుర్గం రాజ్‌కుమార్ ఇంట్లో భారీ చోరీ జరిగింది. సీఐ శశిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజ్‌కుమార్ తన భార్య, తలిదండ్రులతో బుధవారం ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికెళ్లారు. శుక్రవారం ఉదయం బురుదగూడెంలోని ఇంటికి వచ్చి చూడగా ముందు గేటు, ఇంట్లోని బీరువా తెరిచి ఉంది. బీరువాలో దాచి ఉంచిన ఆరు తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. ఫింగర్ ప్రింట్ నిపుణులు, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించి సేకరించిన ఆధారాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దొంగల ఆచూకీ తెలుసుకునే ప్రక్రియ వేగవంతం చేసినట్లు సీఐ తెలిపారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని పేర్కొన్నారు.

జిమ్‌లో డ్రగ్స్, స్టెరైడ్

- జిమ్‌కు వస్తున్న వారికి అందజేత
- దాడి చేసి స్వాధీనపరుచుకున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న స్టెరైడ్ డ్రగ్స్ ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లు

ఆదిలాబాద్‌టౌన్: చట్టవిరుద్ధంగా డ్రగ్స్, స్టెరైడ్ వినియోగిస్తున్న ఆదిలాబాద్‌లోని ఓ జిమ్‌పై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఆ జిమ్‌కు వచ్చేవారికి స్టెరైడ్, డ్రగ్స్ అందజేస్తున్నట్లు తెలియడంతో వన్‌టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఆర్డీవో ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి పట్టణంలోని వినాయక్ చౌక్‌లో గల లయన్ జిమ్ వద్దకు శుక్రవారం చేరుకున్నారు. తనిఖీలు చేపట్టి 20 ఎంఎల్ ఏఎంపీ ఇంజక్షన్ బాటిల్, 3 ఖాళీ ఇంజక్షన్లు, 36 స్టెరైడ్ ట్యాబ్లెట్లు, అలాగే సర్జరీకి వాడే మరో మూడు డ్రగ్స్ ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. అలాగే జిమ్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిమ్ నిర్వాహకుడు షేక్ ఆదిల్ చట్టవ్యతిరేక డ్రగ్స్ తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అలాగే జిమ్‌కు వచ్చేవారికి కూడా ఇస్తూ అనారోగ్యం బారిన పడేలా వ్యవహరించిన అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డీఎస్పీ వెంట ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ సంపతి శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో ముగిసిన రెండోవిడత కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

బాసర: ఆర్జీయూకేటీ బాసర, మహబూబ్‌నగర్ కేంద్రాల్లో రెండోవిడత కౌన్సెలింగ్ ముగిసింది. 218 సీట్లు గాను 178 మంది హాజరయ్యారు. పీహెచ్‌సీ, క్యాప్ కోటా విద్యార్థుల కౌన్సెలింగ్ నిర్వహించారు. శనివారం గ్లోబల్ విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. కౌన్సిలింగ్ ప్రక్రియను వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్ పర్యవేక్షించారు. కన్వీనర్, కో కన్వీనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో యువ వేదిక

వీ హబ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ సెల్ ఆర్జీయూకేటీ సమన్వయంతో బాసర ట్రిపుల్‌ఐటీలో శుక్రవారం యువవేదిక నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ.. యువవేదిక గ్రామీణ విద్యార్థులకు జాతీయస్థాయికి నడిపించే ఆవిష్కరణ వేదిక అని పేర్కొన్నారు. ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్ ‘ఇది మెంటార్‌షిప్, స్టార్టప్ మద్దతుకు ఉత్తమ ప్రారంభం’ అని తెలిపారు. వీ హబ్ ప్రతినిధులు జాహిద్ అక్తర్‌షేక్, ఉహా సజ్జా, తజ్దార్ అలీ తజ్, రేఖా మేఘన, సౌమ్యశ్రీ విద్యార్థులకు ప్రేరణ కలిగించే సెషన్లు, డిజైన్ థింకింగ్ వర్క్‌షాప్‌లు నిర్వహించారు. ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ రాకేశ్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 300కి పైగా విద్యార్థులు ఆవిష్కరణ, నాయకత్వం, వ్యవస్థాపకతలో ప్రాథమిక అవగాహన పొందారు.

మద్యం మత్తులో ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

నిర్మల్: మద్యం మత్తులో జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్ (జి) మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సారంగపూర్ మండలం ఆలూరు గ్రామానికి చెందిన పులి భూమేశ్ (42) మూడేళ్ల క్రితం నర్సాపూర్ (జి) మండలంలోని కుస్లీ గ్రామానికి వలస వచ్చాడు. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. శుక్రవారం ఉదయం అతని భార్య రజిత నిద్రలేచి చూడగా ఇంటిముందు గల రేకుల షెడ్డులో ఉరేసుకుని మృతి చెంది ఉన్నాడు. జీవితంపై విరక్తి చెంది మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్నట్లు రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.